## నాకు నచ్చిన కథ

స్వతంత్రం వస్తుందా రాదా సరే, ముందు ఈ 'కనిస్టీపు వెళ్తాడా అని 'కన్యాశుల్కం'లోని ఓ డైలాగుని పదేపదే గుర్తుకు తెచ్చుకుంటాం. నిజమే తెల్లవాడు మన శత్రువో కాదో ఆ పల్లెటూళ్లో తెలియకపోవచ్చు. కాని ఆ తెల్లవాడి అధికారాన్ని తన కళ్ళముందే చెలాయిస్తున్న కానిస్టేబులు అక్కడ శత్రువు.

**శత్రువు అనే పదంతెలుగ్గువాడికి** తెలుసు. కాని వర్గశత్రువు అనే పదం తెలుగు మార్క్సిస్టుల సృష్టి, ఈ పదం కనిపించినంత తేలికగా ఆ "**వర్గశత్రువెవరో**" కనిపించకపోవచ్చు. బోలెడంత తాత్విక పరిజ్ఞానం వున్నవాడు కూడా నైఘంటిక పదకోశమంతా ధారపోయవచ్చుకాని కచ్చితంగా ఈ **శత్రువెవరో** చెప్పు బాబూ అంటే నీళ్ళు గుటకేస్తారు. అలాంటి సమస్యని తీసుకుని కథగా మలిచారు చలసాని.

ఈ కథలో ఓ ఎస్సయి ఖంగుతిన్న దృశ్యం మొత్తంగా సమాజంలోని పెద్ద మనుషుల గుత్తాధిపత్యంలో బతుకుతూ మొహాలు మార్చే తత్వం కళ్ళకి కట్టినట్టు చిత్రించారు చలసాని. ఒకవిధంగా ఓ ఆడపిల్ల పాత్రని ఆసరాగా తీసుకుని పోలీసువ్యవస్థ డొల్లతనాన్ని ఆయన బయటపెట్టారు. పోలీసోడి కూతురైనా ఖద్దరు స్వామ్యంలో ఓడిపోక తప్పదని, కనిపించే పోలీసు వ్యవస్థ కాక దాని వెనక నడిపించే రాజకీయ వ్యవస్థ అసలు శత్రువని కథారచయిత రుజువు చేశారు.

తక్కువ రాసి ఎక్కువమంది పాఠకుల్ని సంపాదించుకున్న అరుదైన రచయిత చలసాని. నిశితమైన తాత్వికదృక్పథం, సునిశితమైన వ్యంగ్యం, వాస్తవికత నిండుకున్న నిజమైన పాత్రలు చలసాని కథల్లో కనిపిస్తాయి. "శత్రువు కథలో కూడా ఏ పాత్రా ఏ దృశ్యమూ వాస్తవ విరుద్ధంగా కనిపించదు. జీవం తొణికిసలాడుతూ నవ్వుపుట్టిస్తూ చివరికి వ్యవస్థమీద అసహ్యాన్ని అసహనాన్ని పుట్టించి, ఓ కొత్త ఆలోచనకుప్రాణం పోస్తాయి ఆయన కథలు. అలాంటి వాటిల్లో ఈ కథ ఒకటి.

-సమీర్

# శత్రువు

చలసాని ప్రసాదరావు

కానిస్టేబుల్ అటెన్షన్‌లో నిలబడి, నాడాలున్న బూటుకాలు నేలకేసి ఓ బాదు బాది, శాల్యూట్ చేసి, 'సార్' అన్నాడు.

ఎస్.ఐ. తలెత్తలేదు.

టేబుల్ మీద ఏకాగ్రంగా వాలివున్న అతని దృష్టిలో ఖరీదైన బిల్లులు కొన్ని కదలాడుతున్నాయి. వాటిని తిరగవేస్తున్న అతని చేతికో ఖరీదైన వాచీ స్మగుల్డుగా మెరుస్తోంది. రెండోచేతిలో ఉన్న చవకబారు రకం ఆఫీసు కలం ఆ బిల్లుల్లోని మొత్తాల్ని కూడుతోంది.

కూడగా తేలిన మొత్తం ఎస్.ఐ. గారి నరాల్ని పీకుతోంది. అంతాకలిసి దాదాపు మూడున్నరవేల రూపాయల చిల్లర.

ఒక్క రోజులో అక్షరాలా ఇరవై నాలుగు గంటలలో తనకు క్షవరమైన మొత్తం అది.

మూడున్నరవేల రూపాయలు! అదే మన్నా తక్కువ మొత్తమా?

తన మూడున్నర నెలల జీతం!

ట్రాఫిక్ వింగ్‌లో ఉన్నప్పటి స్వర్ణ దినాల్లో .... లారీలవాళ్ళని, ఎడ్లబళ్ళ వాళ్ళని, తోపుడుబళ్ళవాళ్ళని, పేవ్‌మెంట్లమీది కూరగాయల ముసలమ్మల్ని, రోడ్లమీద బుడ్డవ్యాపారుల్ని ఆదరగొడితే రెండుమూడు నెలలకోసారి తన వాటాకు రాలిపడే మొత్తం.

అంతమొత్తం ఒక్కరోజులో ... అక్షరాలా ఇరవైనాలుగ్గంటల్లో రెక్కలొచ్చి నట్లెగిరిపోయింది... సీసాల్లోంచి బీరుగా బ్రాందీగా స్కాచ్ విస్కీగా మారి కారిపోయింది ... చికెన్ రోస్టుల్లో , బిర్యానీల్లో మసాలాగా కలిసి మాయమయ్యింది.

అయితేనేం గాక!... ఉద్యోగాన్ని నిలబెట్టింది. కిరీటాన్ని కాపాడింది.

ఆ మూడున్నరవేల రూపాయలకోసం అంతగా బాధపడనక్కర్లేదు. తనేం ఆస్తిపాస్తుల్లేని బికారిగాడు కాడు. పై సంపాదన అంటే సరిపడని చవటకూడాకాడు

కాని ... కానీ ...

ఉత్తపుణ్యానికి ...

ఒక్కరోజులో ...

ఇరవైనాలుగ్గంటల్లో ...

ఏనాడో ఏభైరూపాయలు తిన్నందుకుగాను కక్కవలసింది ఈనాడు మూడున్నర వేల రూపాయలా...!

మూడేళ్ళనాటి ముష్టి యాభైరూపాయల ముడుపుకు వడ్డీతో కలిసి నిన్న ఒక్కరోజులో కక్కింది మూడున్నర వేల రూపాయలా!

ఆయాభైరూపాయలకు ఆనాడు తనేం అన్యాయంగా కక్కుర్తిపడలేదు. ఏ ఒక్కడినీ పీక్కుతినలేదు. ఏ ఇల్లాలి మంగళసూత్రమూ అమ్మించలేదు. కనీసం చేతిగాజులు తాకట్టేనా పెట్టించలేదు.

ఇచ్చినవాడు కొవ్వెక్కి ఉన్నవాడే!

ఇచ్చుకున్నది వాణ్ణి అన్యాయంగా రక్షించుకోడానికే

అసలు గొడవల్లా, అప్పుడు తాను ఇక్కడగాక ఓ మూరుమూల తాలూకా సెంటర్లో వెలగబెడుతున్నాడు వాడేమో ఆ ఊళ్ళో ఓ బుడ్డలీడరుగా వెలుగుతున్నాడు. వాడిపేటలో వాడిదే రాజ్యం. వాడే కౌన్సిలర్, వాడే మంత్రి వాడే ఐ జి. ఆఫీస్ పోలీసకూడా.

ఆ సంగతి రుజూ చేసేందుకుగాను వాడు మరొకడి కొంప తగలేయించేడు అదేమన్నందుకువాడిబొమికల్ని అతుక్కు వీల్లేకుండా మరీ విరగదన్నించేడు.

ఆ తర్వాత.....

జబ్బచరిచి, దిక్కున్నచోట చెప్పుకు చావరా అని మీసం మెలేసేడు.

అ మీసం ఇరవైనాలుగ్గంటల్లో మూడున్నర వేల రూపాయల్ని తనంతటి వాడి చేతకూడా తగలేయించ గలంతటిదని అప్పట్లో తానసుకోలేదు.

వాడి పేటలో వాడేం చేసుకున్నా తనకు అభ్యంతరం లేదుగాక లేదు! వాడి పేటకు, అందులోని బేవార్సు గాళ్ళకూ వాడు మకుటంలేని రాజే కావచ్చుగాక! అలాంటివాళ్ళి దేశంలో... ఈ ఊళ్ళోచాలామందేవున్నారు. మళ్ళీ మాట్లాడితే వాడి మీసంలో వెంట్రుకలంత మంది ఉన్నారు

కానీ... తానుమాత్రం ఊరు మొత్తానికే మకుటం ఉన్న మహారాజు గదా!

మరి వాడు మర్యాదకోసమన్నా ఆ చేసేదేదో ముందుగా తనతో చెప్పి మరీ చేసి చావగూడదా!

పోనీ--

ఆ తర్వాతనన్నా అర్జంటుగా తన శరణుకోరి, జరిగిందంతా చెప్పేసి లెంప లేసుకుని ఉండవద్దా!

అబ్బే....!

వాడదేం చేయలేదు. ఓ పెద్దబుడ్డీ పగలేసి పీకల్దాకా తాగి మంచానికడ్డం పడి గురక పెట్టసాగేట్ట!

తీరా, ఆ కొంపకాలిన, బొమికెలు విరిగిన వాడి తాలూకు ఓ యాభైమంది ఊరేగింపుగా పోలీస్‌స్టేషనుకు వచ్చి గొడవచేసి కేసురిజిష్టర్ చేయించుకుని, తనచేత హామీలు ఇప్పించుకుని వెళా తీరిగ్గా దయచేసేడు.

అప్పుడయినా ఎలా వచ్చేడు!

తను కబురుమీదకబురంపగా తీరిగ్గా వచ్చేడు.

ఇద్దరు కాన్‌స్టేబుల్స్‌ను పంపగా మంత్రిగారిలా ఎస్కార్టుతో వేంచేసేడు.

గుప్పెడు గుప్పెడు గుబురు మీసాలకు ఏదో రాసుకుని, నున్నగా దువ్వుకుని, వాటిని నిమురుకుంటూ, సువాసనలు వెదజల్లుతూ దయచేసేడు.

"ఏం బాబూ!కులాసా!" అంటూ తన మామగారి పెద్దన్నలాపలకరిస్తూలోపలి కొచ్చేడు.

వాడి ఆ ఫోజు, ఆ వెధవన్నర దర్జా చూసి తనకు మండుకువచ్చిన మాట నిజం.


అప్పుడు తాను ఆఫీసులో తనకెదురుగానే వ్రేలాడుతున్న గాంధీ గారి పటాన్ని చూశాడుగానీ, ఆ గాంధీగారు నెత్తీ, నోరూబాదుకుని మరీచెప్పినశాంతి, సహనాలసంగతిమాత్రం మర్చిపోయేడు

ఫలితంగా...

ఆ బుడ్డలీడరుగాడికి క్షణాల్లో తన సత్తా ఏమిటో చూపించేడు.

తన పవర్లన్నీ వాడిముందుపరిచేడు.

రిజిష్టర్ తెప్పించి రాసిన కేసు స్వయంగా చదివి మరీ వినిపించేడు.






"బోడిమీసాలూ, నువ్వూనూ! నా పవర్లముందు నీ రాజకీయాలు బలాదూర్రా నాయనా" అని చెప్పకుండానే చెప్పేడు.

"నీ రాజకీయాలు నా పవరుకు కేవలం సబార్డినేట్ మాత్రమేరా బుల్లి మీసాల బుడ్డలీడరూ!" అనికూడా ఇండైరెక్టుగా రుజువుచేసేడు.

మొత్తంమీద వాణ్ణి అదరగొట్టి, బెదరగొట్టి వాడిచేత బ్రతిమాలించుకునేదాకా క్రిందికిలాగేడు!

ఆ తర్వాత తీరిగ్గా ఓ యాభై రూపాయల్తో దయదలచి వాడి మీసాల పరువును నిలబెట్టేడు.

ఆ మీసాలిప్పుడు వాటిపవర్సేమిటో చూపించేయి

తమ తడాఖా ఏమిటో తెలియచెప్పేయి.

తాను పొరబడ్డాడు తనపవర్సు వాడిలాంటివాళ్ళ రాజకీయాలకు సబార్డినేటు మాత్రమేనని ఇప్పుడే తెలిసి వచ్చింది. తన టోపీమీది ఇత్తడిమకుటం కన్నా ఏ మకుటంలేని ఆ తెల్లటోపీ పేట లీడరుగాడి రాజకీయ మీసాలే గొప్పవని గత నలభైఎనిమిది గంటలలోనూ స్పష్టముగా రుజూ అయిపోయింది

తన అదృష్టంకొద్దీ రెండేళ్ళనాడే ఆ తిరపతి వెంకన్న దయకొద్దీ కామధేనువు లాంటి ఈ సీట్లోకొచ్చి పడ్డాడు ఈ మారుమూల తాలూకా సెంటర్ నుండి రాజధానికి ప్రమోషన్ మీద ట్రాన్స్‌ఫరై రాగలిగేడు.

కానీ...

తాను కలలో కూడా అనుకుని ఉండని విధంగా, రకరకాల ఉద్యమాల పుణ్యమా అని ఆ బుల్లిమీసాల బుడ్డ లీడరుగాడు కూడా ప్రమోటయ్యేడు. ఊరికే లీడరై ఎవెమ్మెల్యేఅయి కూర్చున్నాడు వాడి గురువొకడు అమాంతం మంత్రి కూడా అయిపోయేడు. వాళ్లిద్దరి గుబురుమీసాల మధ్యా తన ఉద్యోగాన్ని ఉరితీసి సడెన్‌గా సస్పెన్షన్ ఆర్డర్ పుట్టించేడు.

ఆ ఊళ్ళో ఉన్నంత కాలం వాడు తనతో మంచిగానే ఉన్నాడు. కనపడ్డప్పుడల్లా నవ్వుతూ నమస్కారాలు చేసేవాడు. "కులాసానా, బాబూ!" అంటూ పలకరించి తన పెద్దరికాన్ని వెలగబెట్టేవాడు. ఆ మర్యాదల వెనక ఇంత కసి దాగి ఉందని తానేనాడూ అనుమానించ లేదు. ఆ చిరునవ్వులు వెనుక యాభై రూపాయలు వడ్డీతోసహా మూడున్నర వేల రూపాయలై మెరుస్తున్నాయనుకో లేదు ఆ నమస్కారాలవెనక 'నాతడాఖా చూపేరోజురాకపోతుందా! నువ్వే నాకు దణ్ణాలుపెట్టే గతి పట్టించకపోతానా!" అనే ధీమాఉందని తాను చూచాయగా కూడా పసిగట్టలేదు.

వాడిప్పుడు తన ప్రతాపం చూపించేడు. ఆ మధ్య ఏదో ఫంక్షన్‌కు మంత్రిగారితోపాటు వేంచేసినవాడు డ్యూటీలో ఉన్న తనను గుర్తుపట్టి పలకరించేడు. "ఇక్కడున్నావా? ఎక్కడ?" అంటూ పరామర్శించేడు.

ఆ తర్వాత మరచిపోకుండా శిష్యుల చేత పిటీషన్లు పెట్టించేడు గురువుగారికి చెప్పి గప్‌చిప్‌గా సస్పెన్షన్ ఆర్డర్లు పుట్టించేడు. రేపు అసలు తన ఉద్యోగమే ఊడే పరిస్థితుల్ని సృష్టించేడు.

ఇంకానయం ఆ ఆర్డర్లు సంతకాలయి తనదాకా రాకముందే, ఇంకా టైపు కూడా కాకముందే అదృష్టవశాత్తూ తనకు తెలిసిపోయింది.

ఆ రోజంతా తాను గడగడ లాడిపోయేడు. గజగజ వణికి పోయేడు.

ఇంతదాకా కథ నడిచాక, ఫైలు పరుగెత్తేక, సంతకాలన్నీ అయిపోయాక తానిహ చేయగలిగిందేమీ లేదు. అవతల పెద్దతల కాయలున్నాయి. వాటి మీద ఖరీదైన తెల్లఖద్దరు టోపీలున్నాయి తాను ఒక్కడూ వాటికి ఎదురు నిలవలేడు, నిలిచి బ్రతుకలేడు.

మరి...? ఎలా..? ఎలా...?

ఏం చేయాలి?

పిలకదొరక్కపోతే చేతులు, అదీ అందక పోతే కాళ్ళు ..... పట్టుకోమన్నారే ....! ఎవరూ? గాంధీగారేనా? అయినా అందులో తప్పేంలేదంటారు. ఎవరో దేవుడి ఫాదరే గాడిద కాళ్ళు పట్టుకున్నాట్ట గదా!

వెళ్ళి ఆ బుల్లిమీసాల బుడ్డలీడరు గాడి కాళ్ళే పట్టుకుందామా? వాడి టోపీకే మొక్కుదామా? వాడి మీసాలనే కీర్తిద్దామా?... అనుకున్నాడు. మొదటతాను వేరేదారి కనిపించలేదు. వెధవ పురువు... ఉద్యోగమే ఊడుతూంటే ఇంకా పరువెక్కడిది? నెత్తిన ఈ టోపీయే లేకుంటే, వంటిన ఈ యూనిఫారమే లేకుంటే తనకు సలాములు కొట్టేవారెవరు? కనీసం తన మొహం చూసేవాడెవడు?

కానీ... కానీ....

దర్జా చూపిన చోటే దాసోహం పలకటమా! తనకు నిత్యం దణ్ణాలు పెట్టిన వాడి కాళ్ళకున్న చెప్పులకే తానిప్పుడు పాలిష్ చేయటమా! ఛైర్మన్‌గారు!

ఆయనతో పరిచయం ఉందేగానీ అంతగా దోస్తీ లేదు కానీ, ఆయన్నెరుగనివారు లేరు. ఆయనెరుగనివారూ లేరు. ఆయన సత్తా జగద్విఖ్యాతం! మంత్రులకు అంతరంగికుడు ఆఫీసర్లకు మొగుడు! చిన్నపనులకైతే ఆయనసలు కాలు కదప నవసరమే లేదు. ఆయన టెలిఫోను బిల్లుతో రెండు ఎన్జీవో కుటుంబాలు ఆఫీసర్ కుటుంబాల్లా బ్రతకవచ్చునంటారు. ఆయన తడాఖా తెలిసినవాళ్ళు ఆయన వాహనాలకయ్యే పెట్రోల్ బిల్లుతో రెండు మూడేళ్ళకో మేడ చొప్పున కట్టుకో వచ్చునంటారు. ఆ పెట్రోల్ పోయించే పైరవీదార్లు.

అవేవీ అబద్ధాలుగానీ, అతిశయోక్తులు గానీ కావని తానీ నలభై ఎనిమిది గంటలలోనూ రుజూ పర్చుకున్నాడు. తన స్టేషన్‌కు ఎంతో దూరంలో లేని ఆయన గారి బంగళాలో వారి శరణు కోరిన ఎనిమిది గంటలలోగా.. అక్షరాలా ఎనిమిది గంటల్లోగా తన సస్పెన్షన్ ఆర్డర్ని సస్పెన్షన్‌లో పెట్టించేడు. ఏ కళనున్నాడోగానీ ఇంత ఖర్చవుతుంది, అంత కాలంపడుతుంది అని దీర్ఘాలు తీయలేదు.

అసలు సంగతి మాత్రం ఉన్నదేదో ఉన్నట్టుగా వివరించమన్నాడు.

తాను చెప్పేడు దాపరికం లేకుండానే వివరంగా చెప్పేడు. "నిజమే! యేదో మూడ్‌లో

ఉండి ఆగడ్డి తిన్నానప్పుడు. అదెప్పటి మాట! అయినా ఏభై రూపాయలకు... ముష్టి ఏభై రూపాయలకు ఇంత శిక్షా...? కక్షా...?" అని కన్నీళ్ళు కూడా పెట్టుకున్నాడు. పరువు నిలబెట్టమని ప్రార్థించేడు. ఉద్యోగం ఊడినా బ్రతగ్గలను గానీ పరువు పోతే మాత్రం తలెత్తుకోలేనని ఆయన కాళ్లు పట్టుకున్నాడు. పైగా తన ముత్తాతలూ ఆయన ముత్తాతలూ దూరపు బంధువులేనని సోదాహరణంగా వివరించేడు. ఇద్దరం ఒకే జిల్లావాళ్ళం, ఒకే కులంవాళ్ళం అని గుర్తు చేసేడు. ఆ బుల్లిమీసాల బుడ్డ లీడరూ, వాడి గురువూ ఛైర్మన్‌గారి అపోజిషన్ గ్రూపు వాళ్ళనే సంగతి ప్రత్యేకంగా ప్రస్తావించేడు.

అన్నింటికన్నా చివరి పాయింట్ అమోఘంగా పన్జేసింది!

ఛైర్మన్‌గారు దయధలిచేరు!

కార్లు కదిలేయి!

మందిమాగధులు వెంటరాగా దగ్గరుండి సెక్రటేరియట్ గేట్లు తెరిపించేరు. చూడవలసినవారిని చూసి, కూర్చో వలసిన వారిముందు కూర్చుని ఫైళ్లని రప్పించేరు.

అంతా మెరుపులా క్షణాల్లో జరిగి పోయింది.

ఆ పలుకుబడికి అంత అనుభవం ఉన్న తనే దిగ్భ్రాంతుడైపోయేడు.

ఉదయం భోజనాల వేళయ్యేలోగా ఆ సస్పెన్షన్ ఆర్డర్ సస్పెండయ్యింది.

తను ఊపిరి తీసుకున్నాడు. తిరుపతి వెంకన్నకు జుట్టూ, మీసాలూ మొక్కుకున్నాడు.

మందిమాగధులు అక్కణ్ణించి సరాసరి కొండమీది బార్‌కు కార్లను మళ్ళించేరు. ఛైర్మన్‌గారి ఖ్యాతిని వర్ణిస్తూ పంచరత్నాలు చదివేరు. ఆయన పలుకు బడిని కీర్తిస్తూ ఖరీదైన సీసాలు ఖాళీ చేసేరు. ఆయన గొప్పతనానికి జోహార్లు పలుకుతూ కోళ్ళను మింగారు. ఆయన ఆయురారోగ్యాలకై దేవుణ్ణి ప్రార్థిస్తూ ఫోను మీద వచ్చి వాలిన అమ్మాయిల్ని నలిపేరు...కొరికేరు..నమిలేరు!

అయితేనేం గాక...

ఉద్యోగం నిలిచింది.. పురువు దక్కింది.

ఆ ఖర్చులన్నీ లెక్క చూసుకొంటే, బిల్లులన్నీ కూడుకుంటే మూడున్నర వేల రూపాయలకు తేలిందిప్పుడు. నయమే! ఈమాత్రంతో సరిపోయింది. ఉద్యోగం అంటూ ఉండాలేగానీ ఈ టోపీ ఎంతైనా చేసిపెట్టగలదు, రాబట్టగలదు!

కాన్‌స్టేబుల్ భయంగా, వినుగ్గా, వినయంగా మరోసారి నాడాల బూటు కాలునేలకేసి బాది, శాల్యూట్ చేసి 'సార్' అన్నాడు.

బిల్లుల్లోంచి తలెత్తి పైకిచూసేడు ఎస్సై.

కాన్‌స్టేబుల్‌ది తెలిసిన మొహమే.

కానీ అతనివెనుక ఓ తెలీని మొహం ఉంది. అది ఆడమొహం! లేతదనం ఇంకా ముదరని మొహం. అమాయకత్వం ఇంకా వదలని మొహం. ఇదివరకెప్పుడూ స్టేషన్‌కు వచ్చిందాన్లా లేదా మొహం, కనీసం రాత్రి బార్‌కు ఫోన్ కాల్‌తో వచ్చి వాలిన మందలోని హైక్లాస్ మొహాల్లాకూడా లేదది.

"నాకు తెలిసిన వాళ్ళమ్మాయండీ! ఎవడో రౌడీ చేయిచేసుకున్నాట్ట" అంటూ'చెప్పమ్మా' అని ప్రక్కకు తొలిగేడు కాన్‌స్టేబుల్.

అప్పుడామెను పూర్తిగా చూసేడు ఎస్సై.

రంగు ఎర్రగా, డాబుగా లేకున్నా చాలా అందంగా మాత్రం ఉందా అమ్మాయి. వయసు తెచ్చి పెట్టిన పొంగుతో మెరిసిపోతోంది.

స్టేషన్‌కు సామాన్యంగా ఆడాళ్ళెవరూ రారు. లాక్కురా బడతారు. అంతే! వాళ్ళు ఎంత బాగున్నా నలిపేసిన పువ్వుల్లా ఉంటారు. ఎండిన గులాబుల్లాగుంటారు. కాలం చెల్లిన కొంపల్లా ఉంటారు.

కానీ, ఈ పిల్ల అలా లేదు. రంగు ముదిరిన ఆపిల్ పండులా ఉంది. విచ్చుకుంటున్న మందారంలా ఉంది.

మరిఎవడో ఏదో చేసేడంటే చెయ్యడా! ఇలాంటి పండును చూస్తే కొరకబుద్ధి వెయ్యదా!

"చెప్పు" అన్నాడు ఎస్సై.

చెప్పిందామె.

కాలేజీలో చదువుతోంది, తల్లీతమ్ముడూ తప్ప 'నా' అన్నవారు లేదు. ఓ చిన్న పాతకాలపు అద్దెల ఇల్లు తప్ప మరో బ్రతుకు తెరువులేదు. ఆ అద్దెడబ్బుల్తోనే తాముముగ్గురూ బ్రతుకుతున్నారు. తన చదువు పూర్తయి ఉద్యోగం సంపాదించుకోగలిగితే వచ్చేఏడాది నుంచీ ఇంకా బాగా బ్రతకగలుగుతారు.

"అవునుసార్! బాగా చదువుతుంది. కాలేజీలో ఎప్పుడూఫ్లాసులే! ఇంకెంత!ఈ ఏడాదిలో ఉద్యోగంలో చేరిపోవచ్చు ఏ లోకాన్నున్నాడో, ఆ బాబు సంతోషిస్తాడు" అన్నాడు కాన్‌స్టేబుల్.

అంతవరకూ నిబ్బరంగా ఉన్న ఆ పిల్ల కళ్ళు చెమ్మగిల్లేయి "మా నాన్న ఈ స్టేషన్లోనే పనిచేసేవాడండీ" అంది బిగబట్టుకుంటూ!

"అవునుసార్! చెప్పనేలేదు, వీళ్ళ నాన్ననాతోనే పనిచేసేవాడు. మీరురావటానికి కొంచెం ముందే డ్యూటీలో ఉండగా ఓ ఆక్సిడెంట్‌లో పోయేడు" అన్నాడు కాన్‌స్టేబుల్.

ఎస్సైకి గుర్తుకొచ్చింది. అవును! తనొచ్చినకొత్తల్లో ఆ కాగితాలు చూసేడు సంతకాలు చేసి పంపేసేడు కూడా. ఈ కేసును అంతతేలిగ్గా వదిలెయ్యగూడదు. కాన్‌స్టేబుల్ కూతురిమీద చెయ్యేసిన వాణ్ణి క్షమించగూడదు. ఆ వెధవెవడో వాణ్ణి పట్టి లాక్కొచ్చి లాకప్‌లో వేయించాలి. ఈ పిల్ల కాళ్లకు మొక్కించాలి. వాడి మేక్కెలు విరగదన్నించాలి. జైలుకు పంపి కనీసం ఆర్నెల్లు గంజికూడు రాయించాలి. జన్మలో మరే ఆడపిల్లనూ కన్నెత్తి చూడకుండేలా పాఠం నేర్పించాలి.

"ఎలా ఉంటాడు వాడు? గుర్తు పట్టగలవా?" అడిగాడు ఎస్సై.



"దున్నపోతులా ఉంటాడండీ! పెద్ద పెద్ద చెంపలూ, దుబ్బుజుట్టూ వాడూను. గుర్తు పట్టటానికేం! మా వెనకింట్లోనే గదా వాడుండేది."

నవ్వొచ్చింది ఎస్సైకు తనకు నచ్చని వాడెవడైనా ఆడపిల్లకు 'దున్నపోతు' లాగే కనబడతాడు గాబోల్సు.

ఏం చేస్తుంటాడు వాడు?"

"వాళ్ళ మేడమీది ప్రక్కగది కిటికీలో కూర్చుని, మా దొడ్లోకీ, బాత్రూం కేసీ చూస్తుంటాడండీ!"

"అదేమిటీ?"

"అవునండీ! వాళ్ళ మేడవెనుకే గదా మా పెంకుటిల్లు"

"ఓహో" అనుకున్నాడు ఎస్సై. ఇందులో కొంచెం ప్రేమపురాణం లాంటిదేదో కలిసి ఉన్నట్లుంది అయితే అది వాడివైపునుంచే గానీ ఈ పిల్లవైపు నుంచి కూడా ఉన్నట్లు లేదు.

ఆ మాటే పైకి అనేశాడు ఎస్సై.

పళ్ళు కొరికిందా పిల్ల రోషంతో మొహం

బిగుసుకు పోయింది. "వాడో రౌడీ వెధవండి! రోజుకో ఆడపిల్లవెంట పడుతుంటాడు. ఎప్పుడు చూసినా మా కాలేజీ గుమ్మం చుట్టూ తిరుగుతూనే కనుపిస్తాడు. వాడికి ప్రేమ ఏమిటండీ! వాడిబొంద!"

"సరే! ఏంజరిగిందో చెప్పు, వివరంగా"

"వాడు మా ఇంటి మీద బాగా కన్నేసి ఉంచినట్టున్నాడండీ! నిన్నసాయంత్రం ఒక్కత్తెనే ఇంట్లో ఉండగా చూసి పిల్లిలా లోపలికి దూరి తలుపులు గెడవేశాడండీ".

గుర్తుకొచ్చింది ఎస్సైకు. రాత్రి బార్‌లో పెద్దలు కూడా ఆడపిల్లలు సెంటు వాసనలు గుప్పుమనిపించు కుంటూ వచ్చి పడగానే ఆపసోపాలు పడుతూ లేచి ఒక్కొక్కరే చల్లగా, పిల్లుల్లా తలోగదిలోకీ జారుకున్నారు వాళ్ళవెంట. తనొక్కడే బయట మిగిలి పోయాడు బిల్లులు కూడుకుంటూ.

"తర్వాత"?

"వాడు ఏదో ఏడిసేడు. నన్ను ప్రేమిస్తున్నాట్ట. మన సినిమాల్లో వింటూంటామే, అలాంటి డైలాగులన్నీ బట్టీ పెట్టినట్టు వల్లించేడు.

"మరి నువ్వేమన్నావు?"

"మా అమ్మ మీ ఇంట్లోనే ఉందిగా మరి ఆమెను అడగక ఇక్కడి కెందు కొచ్చావు" అన్నాను.

"మీ అమ్మ వాళ్ళింట్లో ఎందుకుంది?"

"రోజూ వెళ్ళినట్లే వెళ్ళిందండీ! ఆవిడ వాళ్ళింట్లో మానాన్న పోయినప్పట్నుంచీ వంటచేసి పెడుతోంది గదండీ!"

ఎస్సై నవ్వేడు ప్రపంచం మారిపోతోంది. వంటమనిషి కూతుర్ని మేడ గలవాడు లవ్ చేస్తున్నాడు. తనంతటగా వెళ్ళి ప్రాధేయ పడుతున్నాడు. మరైతే వాడు తలుపుగెడ ఎందుకు వేసినట్లు?

"అందుకు వాడేమన్నాడు?"

"అదెలాగూ జరుగుతుందిగా. ప్రస్తుతానికి ఓ ముద్దివ్వవా!... ఒక్కసారి... ఒక్కసారి... అంటూ మీదపడబోయాడండీ!"

"మరి నువ్వేం చేశావు?"

"ఉద్ది లెంపకాయ వేసి తలుపుకేసి చూపించానండీ"

"అయితే, నువ్వే ముందుగా వాడిమీద చెయి చేసుకున్నా వన్నమాట?"

"సార్" కాన్‌స్టేబుల్ బెరుకుగా నసిగేడు "కానీ, వీళ్ళింట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి నందుకు వాడే నేరస్తుడవు తాడు కదండీ?"

"అవునవును" అన్నాడు ఎస్సై.

"ఆ తర్వాతే మయ్యింది?"

"వాడు సంస్కారమున్న మనిషిలాలేడండీ! వెకిలిగా ఏదేదో బ్రతిమాలుతూ మీదపడి వాటేసుకున్నాడండీ! వదిలించుకునే పెనుగులాటలో నేనో మూలనున్న కత్తిపీట మీద పడ్డానండీ, కొద్దిలో తప్పిపోయి చెయ్యి మాత్రం గీసుకు పోయింది గాని చెయ్యి తెగాల్సిందసలు" అంటూ మోచేతి దగ్గర కత్తిగాటు చూపించిందామె.

వళ్ళుమండింది ఎస్సైకి. "అది పెట్టి ఒకటిచ్చుకోకపోయావా?" అనబోయి తన హోదాగుర్తుకొచ్చి ఆగేడు.

అతడి భావాల్ని పసిగట్టినట్లుగా అందామె "చేతిమీద రక్తం చూడగానే ఆవేశం, మొండిధైర్యం ముంచుకు వచ్చాయండీ, ఆ కత్తిపీట పుచ్చుకొని వాడి మీద పడబోయానండీ!"

"శభాష్!" అబోయి తమాయించుకున్నాడు ఎస్సై.

"కానీ..." ఆగిందామె.

"ఎదురుగా గోడ మీద వ్రేలాడుతున్న గాంధీ తాత నవ్వుతూ, మందలిస్తున్నట్లుగా కనిపించిందండీ".

"వాడెవడూ" అనబోయి ఎదురుగా గోడకున్న బోడిగుండు బొమ్మనుచూసి "ఓహో" అనుకున్నాడు ఎస్సై.

"పైగా ఆ ప్రక్కనే యూనిఫాంలో ఉన్న మానాన్నగారి ఫొటోకూడా ఉందండీ"

"అయితే?"

"గాంధీగార్ని చూసి ఆగిపోయేనండీ! మా నాన్నగారి యూనిఫాం కనపడగానే ఇలాంటి దున్నపోతుల పనిపట్టేందుకు మీరంతా ఉన్నారు గదా అని నిగ్రహించుకున్నానండీ"

ఎస్సై సంతోషించేడు. ఈ పిల్ల తెలివి గలది. తనను తానే అదుపులోకి తెచ్చుకుని ఓ మర్డర్ కేసు తనదాకా రాకుండా చేయగలిగింది. గాంధీగారంటే ఏమో అనుకున్నాడుగానీ మర్డర్లను కంట్రోల్ చేయగలంతటి వాడన్నమాట ఆ బోడిగుండు పెద్దమనిషి.

తన మెచ్చుకోలును దాచుకోలేదు ఎస్సై. "మంచిపని చేశావమ్మాయీ. అలాంటి దున్నపోతుగాళ్ళవని వట్టేందుకే మేమున్నామిక్కడ. వాడెక్కడున్నాతోలుకొచ్చి లాకప్‌లో వడేయిస్తాను. జైల్లోకితోసి ఆర్నెల్లయినా జొన్నకూడు తినిపిస్తాను. రాస్కెల్‌కు పోలీసోడి కూతురంటే ఏమిటో తెలిసివచ్చేట్లు చేస్తాను. ఇంతకూ మీ ఇల్లెక్కడ? పద చూద్దాం! అంటూ లేవబోయేడు.

"ఈ మేన్ రోడ్ చివర్న పెద్ద బంగళా లేదూ. దాని వెనుక గల్లీలోనే మా పెంకుటిల్లు! వాడు కూడా అక్కడే ఆ బంగళా లోనే దొరక వచ్చుండీ!"

"ఈ చివరి పెద్ద బంగళాలోనా? వాడు అక్కడెందుకుంటాడు?"

"మరెక్కడుంటాడు. అది వాడిదేగదండీ! వాడి ఫాదర్ ఓ లీడరు వచ్చిపోయే కార్లతో జీపుల్తో ఎప్పుడూ సందడిగా ఉంటుంది. అక్కడ కోడిని కొయ్యని రోజు లేదంటుంది. మా అమ్మ!"

బాంబు పేలినట్లయింది ఎస్సైనెత్తిమీద.

ఈ పిల్ల వర్ణించిన ప్రకారం అయితే ఆ బంగ్లా సాక్షాత్తూ ఛైర్మన్‌గారిదే. కొంప దీసి ఆ దున్నపోతు ఈయన గారి కొడుకు కాదుగదా!

"ఏ చివర్న ఉన్న బంగ్లా?" తడబడుతూ అడిగేడు ఎస్సై.

"అవతలి చివర్నేనండీ! తేలిగ్గానే గుర్తుపట్టొచ్చు. ఆ దున్నపోతుగాడి ఫాదర్నంతా ఛైర్మన్‌గారంటూ ఉంటారు."

స్తంభించి పోయేడు ఎస్సై.

అయిదు నిమిషాలదాకా తేరుకోలేక పోయేడు.

"సరె... నువ్వెళ్ళు...!"అన్నాడు చివరికి.

"కేస్ రిజిస్టర్లో ఎంటర్‌చేసి సంతకం చేయించమన్నారా సార్?" కాన్‌స్టేబుల్ అడిగేడు.

"మీ పీక కొయ్యమన్నారా సార్?" అన్నట్లుగా వినిపించిందామాట ఎస్సైకు.

"అదంతా తర్వాత చూద్దాంగానీ, ముందామెను ఇంటివద్ద దింపిరా! పెద్ద తలకాయల్తో వ్యవహారం, కాస్త జాగ్రత్తగా ఉండాలని వాళ్ళమ్మతో చెప్పు" అన్నాడు ఎస్సై.

"వాడు మళ్ళీ ఇలాంటి దున్నపోతు పనులు చేయకుండా చూడాలండీ" అందాపిల్ల సందేహిస్తున్నట్లుగా. ఎస్సైగారి పాలిపోయిన మొహం చూస్తే ఏదో అర్థమయి నట్లుందామెకు.

"దున్నపోతు" అనే మాట ఈసారి నవ్వు తెప్పించలేదు ఎస్సైకు. ఆ మాట మరీ కటువుగా ఉన్నట్లనుపించి తల పైకెత్తేడు.

కాన్‌స్టేబుల్‌కు సంగతి అర్థమయింది. సంజ్ఞచేసి ఆ పిల్లను బయటికి తీసుకు పోయేడు.

ఎస్సై తలవట్టుకు కూర్చుండి పోయాడలాగే. మరో అరగంటకు కాన్‌స్టేబుల్ తిరిగి వచ్చేదాకా అతనలాగే ఉండి పోయేడు. జన్మలో మొదటిసారిగా నల్లత్రాచును చూసిన వాళ్ళా బెదిరిపోతున్నాడతను.

"చూడూ! మీ వాళ్ళమ్మాయేం నంటున్నావుగా, ఆ పిల్లను కాస్త జాగ్రత్తగా ఉండమను, ఛైర్మన్‌గారి అబ్బాయి మీద రేప్‌కేస్ అంటే మాటలేం కాదు. తనకు అనుకూలంగా వెయ్యిన్నొక్క సాక్ష్యాలు

# ఈ రాత్రికి తల ఎక్కడ?

డా. మానేపల్లి




విశాఖపట్నం ఎప్పుడెళ్లినా అంతే-
ఒకోసారి మరీనూ
నెత్తిమీద ఆకాశమో, చెట్టో, కరెంటు స్తంభమోతప్ప
కాళ్లకింద ఇల్లుండదు
దిక్కు లేని భావం ఒకటి దిగులుగా గుండెను దిగదీస్తుంటుంది
అక్కడా అక్కడా తిన్న హోటేలు సున్నం
తాగిన రక రకాల చిక్కని పల్చని వేణ్ణీళ్ళూ, చన్నీళ్లూ
అన్నకోశమంతా అపానవాయుమయం
ఎక్కడెక్కడో తిరుగుతుంటే వొళ్లంతా స్ప్రే పెయింట్‌లా దుమ్ము
దేహం దుర్గంధమయం, మెదడంతా మైల....

నగరంలో ఎటు వెళ్లినా సముద్ర సామ్రాజ్యం
నిన్నోకంట కనిపెట్టినట్టే వుంటుంది
వాతావరణ కాలుష్యం వల విసురుతూనే వుంటుంది
చెట్టుమీదా గుట్టమీదా బడిమీదా గుడిమీదా
ఐఎమ్ఎఫ్ తెల్లరాబందులు మరులుగొలిపే మారు వేషాల్లో
మాటు కాస్తున్నట్టుంటాయి!
తలదాచుకుందామంటే చీమకన్నమన్నా దొరకదు
ఎప్పుడు విశాఖపట్నం వెళ్లినా అంతే
ఎవరింటికెళ్లినా అదొకలాంటి
'పరాయి' భావమే పహరా కాస్తున్నట్టుంటుంది
చెంగ్రలావుపేట చుట్టాలింటికా
సీతమ్మధార స్నేహితులింటికా
స్టీలు ప్లాంటు తమ్ముడింటికా
లేక రామ్‌నగర్ గుట్టల్లోకా, యూనివర్శిటీ పుట్టల్లోకా...
ఎప్పటికీ తెగని సంశయమే
సంశయాత్మా వినశ్యతిట!

గోదారి ఈతా లంకమేతా
పనులు చూస్తే చెదిరిన కారమ్స్ కాయిన్స్
రాత్రికి రెసిడెన్స్ రెడ్‌కాయిన్ - లక్!
వెయ్యికాళ్ల జెర్రిలా విస్తరిస్తున్న విశాఖనగరంలో
సిటీబస్సుకోసం ఉరుకులూ, పరుగులూ
రోడ్మీద నిలబడితే
రెండేసి చక్రాలు, మూడేసి చక్రాలు, నాలుగేసి చక్రాలు
గుండెలమీద తన్ని పోతూనే వుంటాయి
• ఇంత పెద్ద బస్తీలో బండిలేని బ్రతుకూ ఒక బ్రతుకేనా... ఛీ...
శరీరం పీక్కుపోయి విరక్తి పుట్టి....

ఎప్పుడో అతి అరుదుగా ఓ చిన్న మెరుపు
తరచుగా స్నేహితుల పలకరింపు
పత్రికలో మీ కథ చదివాను
ఆకాశవాణిలో మీ కవిత విన్నాను
పేపర్లో అదేదో వూళ్లో మీ ఉపన్యాసం ఫొటో చూశాను
ఫరవాలేదు మనమూ ప్రసిద్ధులమే
మనల్నీ పలకరించేవాళ్ళున్నారనే ఊరట
ఉమ్మిలా ఎండిపోతుంది-
ఇల్లులేని వాళ్లమొహం మీద నగరం ఊసిన ఉమ్మిలా ఉప్పుగాలి
చల్లగా వెక్కిరించినట్టుంటుంది
ఈ రాత్రికి తలదాచుకునే దెక్కడ? ... ఎక్కడ...?....

సముద్రంలో వాయుగుండంలా అదే ప్రశ్న సుడి తిరుగుతుంది.
విశాఖపట్నం ఎప్పుడెళ్లినా హంతే...
ష్.... విశాహపట్నమే కాదనుకుంటాను-
ఏ పట్నంలో నయినా 'పరాయి' బతుకుల బతుకింతే....

తేగలడు. ఆ టయిముకు తాను యే మంత్రి గారింట్లోనో వాళ్ళ ఫాదరుతో పాటు విందారగిన్తున్నట్లుగా నర్టిఫికేట్లు పట్రాగలడు..... మళ్ళీ మాట్లాడితే అసలాపిల్లే తనను బ్లాక్‌మేల్ చేసేందుకు గాను తన పరువునిలా రేప్ చేస్తోందని దబాయించ గలడు" అన్నాడు ఎస్సై.

"ఎస్సర్!" అన్నాడు కాన్‌స్టేబుల్.

"అయినా, మనలో మాట, అంతపెద్ద ఛైర్మేన్‌గారి అబ్బాయంతటి వాడు స్వయంగా వచ్చి పెళ్ళాడుతానని ప్రాధేయపడుతూంటే, ఈ పిల్ల ఎగిరి గంతేయాలిగానీ, కత్తిపీట వుచ్చుకుని మీద పడటం ఏమిటి? అమాయకంగా అడిగాడు ఎస్సై.

జవాబుగా చేతిలో అట్టపెట్టె ఒకటి టేబుల్ మీదుంచేడు కాన్‌స్టేబుల్, "మీకు ఇవ్వమని ఆ పిల్ల ఇచ్చిందండీ" అని శాల్యూట్ చేసి, నాడాలున్న బూటు కాలు మరోసారి నేలకేసి బాది వెళ్ళి పోయేడు.

ఆ పాకెట్ ఏమిటో, ఎందుకో అర్థం గాలేదు ఎస్సైకు. బహుశా సాక్ష్యం కోసం పగిలిన గాజులో, చిరిగిన రవికో పంపి ఉంటుందాపిల్ల, పాపం అమాయకురాలు! అనుకుంటూ విప్పి చూసేడు.

చూసి తెల్లబోయేడు.

ముక్కలు ముక్కలైన అద్దం, ఫ్రేములతోసహా చిరిగిపోయిన బోసి నవ్వుల బోడి గాంధీగారి పటం ఉందందులో

దానితో పాటే ఆపిల్ల ఫాదర్‌దిగాబోలు వెలిసి పోయిన, పోలీస్ యూనిఫారం కూడా ఉందందులో.

అర్థం అయింది ఎస్సైకు.

"పాపం పిచ్చిపిల్ల" అని ఇంతకు ముందులా మాత్రం అనుకోలేకపోయాడా క్షణాన.